## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



3 లో

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం... ప్రజల కోసం

## సిద్దిపేట

మంగళవారం | 21 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 4





# ఎవరు ఎటువైపు



## అన్ని పార్టీల్లోనూ టెన్షన్

## మునిసిపల్స్ సత్తా చాటేందుకు స్కెచ్

సిద్దిపేట,ఏప్రిల్ 20(ప్రజాజ్యోతి): సిద్ది పేట పురపాలిక పరిధిలో ఎవరు ఎటువైపో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. పుర పాలిక పాలకవర్గ పదవీకాలం పక్షం రోజుల్లో ముగియనుండడం, మళ్ళీ ఎన్నికలు ఎప్పు డు జరుగుతాయి... రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనన్న అభిప్రాయంతో రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశిస్తున్నా ఆశావాహులు ఇప్పటి నుండే దారి వెతుక్కుంటున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. గతంలో ఎప్పుడు లేని విదంగా ఈ సారి జర గనున్న సిద్దిపేట పురపోరు ఆసక్తిని పెంచు తోంది. ప్రస్తుతం ఉన్న వార్డుల సంఖ్య ఇలానే ఉంటుందా...ఇంకా వార్డుల సంఖ్య పెరుగుతాయా అన్న మీమాంసలో ఆశావా హులు అయోమయంలో ఉన్న వేళ అనుకూలంగా వుండే

మిగతా 2లో..



4 లో

కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన

## ప్రజావాణిలో 163 ఫిర్యాదులు స్వీకరణ



2 లో

## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు

సిద్దిపేట ,ఏప్రిల్ 20 , (ప్రజాజ్యోతి): బసవేశ్వ రుడు సమాజంలో సమానత్వం, సామాజిక న్యా యం, శ్రమకు గౌరవం అనే విలువలను ప్రోత్స హించిన మహనీయుడని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. ల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మం డలం పరిధిలోని పొన్నాల బైపాస్ చౌరస్తా వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి కె. హైమావతి గారు పూలమాల వేసి ఘన నివా ళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ బసవేశ్వరుడి బోధనలు నేటి తరానికి కూడా మార్గదర్శకంగా నిలుస్తాయని, సమాజంలో వర్గ వివక్షలు లేకుండా అందరూ సమానంగా జీవిం చేలా ఆయన చూపిన మార్గాన్ని అనుసరించా ల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్ర మంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సయ్యద్ రఫీ, వివిధ కుల సం ఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికా రులు తదితరులు పాల్గొన్నారు.





## రైతులకు అండగా నిలుస్తాం

### సర్పంచ్ బండారు కవిత స్వామిగౌడ్

తొగుట, ఏప్రిల్ 20 (ప్రజాజ్యోతి): మట్టిని నమ్ముకుని చెమటోడ్చి దేశానికి అన్నం పెట్టే రైతు సోదరుల సేవలు అమూల్యమని, రైతుల త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమని, వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామ సర్పంచ్ శ్రీమతి బండారు కవిత స్వామిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా 2018-19 సంవత్సరానికి సంబంధించిన ఆర్ఓఆర్ దరఖాస్తుదారులకు నోటీసులను పంపిణీ చేశారు. నోటీసులు స్వీకరించిన తర్వాత తదుపరి పట్టా ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతుల హక్కుల సాధనలో ప్రతి అడుగులోనూ గ్రామ పంచాయతీ రైతులతోనే ఉంటుందని, సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని రైతు సంక్షేమమే తమ మొదటి ప్రాధాన్యం అని పేర్కొన్నారు.

## ఘనంగా శ్రీ విశ్వగురు బసవేశ్వర జయంతి ఉత్సవాలు



కొండపాక ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి ):కుకునూరుపల్లి మండల పరిధి లోని తిప్పారం గ్రామంలో శ్రీ విశ్వగురు బసవేశ్వర జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట జిల్లా లింగాయత్ గౌరవ అధ్యక్షులు, కుకునూరుపల్లి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు ఆకుల భద్రప్ప హాజరయ్యారు. కుకునూరుపల్లి మండల లింగాయత్ అధ్యక్షులు కోరే ఆంజనేయులు, తిప్పారం గ్రామ లింగాయత్ అధ్యక్షులు కోరే మల్లేశం ఆధ్వర్యంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. బసవేశ్వరుడు కులమతాలకు అతీతంగా సమానత్వాన్ని బోధిస్తూ అనుభవ మంటపాన్ని ఏర్పాటు చేసిన మహానుభావుడని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకమని అందరూ స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి సర్పంచ్ మల్లం ఐలయ్య, ఉప సర్పంచ్ దొంతి సత్తయ్య, మాజీ సర్పంచులు పోల్కంపల్లి నరేందర్, కాసం నవీన్, నాయకులు ఇండ్ల కనకయ్య, పిష్కా అమరేందర్, వార్డు సభ్యులు, మండలంలోని లింగాయత్ నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో 163 ఫిర్యాదులు స్వీకరణ

సిద్దిపేట ,ఏప్రిల్ 20 , (ప్రజాజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ముఖ్య లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్తో కలిసి ఆయన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి భూ సమస్యలు, హౌసింగ్, ఆసరా పింఛన్లు మరియు ఇతర అంశాలకు సంబంధించిన మొత్తం 163 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రతి అర్జిని సత్వరంగా పరిష్కరించి, బాధితులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ఏఓ రాజ్ కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎవరు ఎటువైపు



మొదటి పేజీ తరువాయి..

వార్డును వెతుక్కునే పనిలో పడ్డారు. ప్రధాన పార్టీలన్నీ రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు యత్నిస్తుండటంతో ఆశావాహుల్లోనూ గెలుపు లక్ష్యం గా ముందుకు వెళ్లేందుకు అవసరమైన పార్టీని వెతుక్కునే పనిలో ఉండటంతో ఎన్నికల నాటికి ఎవరు ఏ పార్టీలో ఉంటారో ఎన్నికల నాటికి చెప్పటం కాసింత కష్టంగానే ఉందని చెప్పవచ్చు.

### ఇప్పటికే షురూ అయిన చేరికలు

మునిసిపల్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ ఎలాగైనా మెజార్టీ వార్డుల్లో సత్తా చాటి మునిసిపల్ ను కైవసం చేసుకునే పనిలో పడ్డారు. ఇందులో బీఆర్ ఎస్ పార్టీ ముందు వరుసలో ఉందని చెప్పవచ్చు. మునిసిపల్ లో బలమైన పార్టీగా ఉన్న బీఆర్ ఎస్ పార్టీ మరింత బలాన్ని పెంచుకునేందుకు పలు వార్డుల్లో ఇప్పటికే ఆయా పార్టీల్లో ఉన్న వారిని చేర్చుకుంటున్నారు. పలు వార్డుల్లో యువకులకు గాలం వేసి ఎదుటిపార్టీలకు ఝలక్ ఇచ్చేందుకు మాజీ మంత్రి హరీష్ రావు చేతుల మీదుగా కండువాలు కప్పుకుని పార్టీలో చేరుతున్నారు. ఇక బీఆర్ ఎస్ చేరికల విషయంలో దూకుడుగా వ్యవరిస్తుండటంతో అధికార పార్టీ కాంగ్రెస్ సైతం సత్తా చాటేందుకు ఉవ్విళ్లూ ఊరుతోంది. ఇప్పటికే పార్టీలోకి చేరికలు ఆహ్వానించి రాబోయే ఎన్నికల్లో సిద్దిపేట బల్దియా కైవసం చేసుకునే పనిలో ముందుకు సాగుతుందని చెప్పవచ్చు. చేరికల విషయంలో బీఆర్ ఎస్,కాంగ్రెస్ లు ముందుండగా బిజెపి కూడా సరైన అభ్యర్థుల కోసం వెతుకులాట షురూ చేసింది.

### పనుల్లో వేగం... ఆశావాహులు ఆగమాగం....

సిద్దిపేట పురపాలిక పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు విరివిగా సాగుతున్నాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు అన్ని వార్డుల్లో వేగంగా సాగుతుండటంతో ఆయా వార్డుల కౌన్సిలర్లు సంతోష పడాలో... పదవి కాలం ముగియడానికి కొద్ది రోజులే ఉండటంతో రేపు ఎలా అనే సంశయాన్ని వ్యక్తం చేస్తున్నారు. చేసిన అభివృద్ధి పనులు ఏ ప్రభుత్వంలో జరిగాయో కూడా సిద్దిపేటలో చెప్పలేని పరిస్థితులు ఉండటం తో రేపటి ఎన్నికల్లో ప్రజలు ఎవ్వరిని నమ్ముతారో అన్న అనుమానం కలుగుతోంది.

### ప్రజల్లో ఉండండి.. పార్టీ కార్యాలయాలు తెరవండి....

అన్ని పార్టీలు ఆశావాహులను ఇప్పటి నుండే పార్టీలు అలెర్ట్ చేస్తుండటంతో ఇప్పటికే పలు వార్డుల్లో ఎన్నికల కోలాహలం మొదలయ్యింది. పండగల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపే విదంగా బ్యానర్లు కట్టడంతో పాటు ఆయా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అంతటితో ఆగకుండా అన్ని వార్డుల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించి ప్రజలతో మమేకం కావాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే ఆయా పార్టీల పార్టీ కార్యాలయాలు ప్రారంభించే కార్యక్రమం మొదలు పెట్టారు.ఆయా పార్టీలు కూడా పార్టీ కార్యాలయలకేంద్రంగా కార్యాచరణ మొదలు పెట్టె ఉద్దేశ్యంతో ముందుకు సాగుతుండగా సిద్దిపేటలో ఎన్నికల కోలాహలం షురూ అయినట్లే కనిపిస్తుంది. ఏది ఏమైనా గెలుపే లక్ష్యంగా ఆశావాహులు అనుకులంగా ఉండే పార్టీని వెతుక్కునే పనిలో ఉండటంతో ఎన్నికల హడావిడి ఇప్పటినుండే షురూ అయ్యిందని చెప్పవచ్చు.

# ఉచిత దంత వైద్య శిబిరం

నంగునూర్, ఏప్రిల్ 20(ప్రజా జ్యోతి): మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో సోమవారం నాడు సిద్దిపేటకు చెందిన శ్రీనివాస సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఈరోజు వెంకటాపూర్ గ్రామంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని సుమారుగా 300 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు అలాగే వారికి కావలసిన మందులు కూడా అందించడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి తో పాటు ఉపసర్పంచ్ పంచాయతీ కార్యదర్శి పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.









## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### దేవులపల్లి యాదగిరి ఏఎంసి చైర్మన్

నంగునూర్,ఏప్రిల్ 20(ప్రజా జ్యోతి): కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి రైతులు మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అన్నారు సోమవారం నాడు పాలమాకుల, ముండ్రాయి, రాజగోపాల్పేట, అంక్సాపూర్, గట్ల మల్యాల, రాంపూర్, గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్యాడి కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శ్రీనివాస్ తో కలసి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు దళరుల బారిన పడకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుకు మద్దతు ధర అందించాలనే దృక్పధంతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని అన్నారు. ఎ గ్రేడ్ ధాన్యానికి 2389/-రూ,, లు కామన్ గ్రేడ్ ధాన్యానికి 2369/- రూ,, ల మద్దతు ధర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ డైరెక్టర్లు ఐలయ్య ఇమ్రాన్ రంగారెడ్డి ఏవో గీతా ఏఈఓ చైతన్య సీసీలు శ్రీనివాస్ లింగం మల్లేశం సేనాపతి ప్రేమలత ఆయా గ్రామాల సర్పంచులు ఓజాల్. జిడ్డి చామంతి. మయోజు పద్మ. చేర్యాల వాణి. ఆయాల గ్రామాల మార్కెటింగ్ కమిటీ సభ్యులు వివోఏలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యం పంపిణి



నంగునూరు,ఏప్రిల్ 20 ప్రజా జ్యోతి): నంగునూరు మండల పరిధిలో ని రాజగోపాలపేటలో అనారోగ్యంతో మృతి చెందిన బీజేపీ కార్యకర్త జాజుల రామచంద్రం కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వాసరి యాదమల్లు, నాయకులు పప్పు సురేందర్ రెడ్డి, కోల శ్రీకాంత్ గౌడ్ సోమవారం పరామర్శించారు. రామచంద్రం చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లి కుటుంబాన్ని ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. అనంతరం మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొల్లు సందీప్, కుందేటి సత్యం, ముక్క అనిల్, మధు యాదవ్, శ్రీకాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



మిరుదొడ్డి, ఏప్రిల్ 20, ( ప్రజా జ్యోతి ) : మిరుదొడ్డి మండల కేంద్రంలో విశ్వగురు మహాత్మ బసవేశ్వర 893వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ మండల అధ్యక్షుడు పూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, బసవేశ్వరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భ ంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ, కులమత భేదాలకు అతీతంగా సమానత్వాన్ని బోధించిన మహానుభావుడు బసవేశ్వరులని కొనియాడారు. కాయకమే కైలాసం అనే మహోపదేశాన్ని స్మరించుకు న్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి పూడూరి రాజు, పూడూరి వీరేశం, కృష్ణ, మహేష్, నవీన్, బీఆర్ఎస్ నాయకులు తుమ్మల బాల్రాజు, కాంగ్రెస్ నాయకులు ఎండి జాహింగీర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



మిరుదొడ్డి, ఏప్రిల్ 20, ( ప్రజా జ్యోతి) : రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంయుక్త శ్రీధర్ అన్నారు. పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి, రైతులు మోసపోవద్దని సూచించారు. సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ శ్రీనివాస్ తో కలిసి ఏఎంసి చైర్మన్ సంయుక్త-శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా గ్రామీణ ప్రాంతాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరుగుతుందన్నా రు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం క్వింటాలు వరి ధాన్యానికి 2389/- మద్దతు ధర కేటాయించడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన కొద్ది గంటల్లోనే నేరుగా రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. మాయ మాటలు నమ్మి దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యాన్ని విక్రయించి రైతులు మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఐకెపి సిబ్బందికి సూచించారు. ఈ



కార్యక్రమంలో ఏపిఎం నర్సమ్మ, సీసీ వైకుంతం, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బసవేశ్వర జయంతి వేడుకలు



కొమురవెల్లి, ఏప్రిల్ 20 (ప్రజా జ్యోతి); అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాగణపతి పూజతో పాటు మహాత్మా బసవేశ్వరుల పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఆదిత్య పరాశ్రీ అంబాత్రయ క్షేత్ర మహాస్వాముల వారు ప్రత్యేకంగా పూజలు చేశారు. మహాత్మా బసవేశ్వరులు కర్ణాటకలోని బాగేవాడి గ్రామంలో 1131లో జన్మించి, సమాజంలో ఉన్న అనేక దురాచారాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. అస్పృశ్యత, బాల్యవివాహాలు, అంటరానితనం, లింగ వివక్షత వంటి సామాజిక కీడులను వ్యతిరేకిస్తూ సంస్కరణలు తీసుకువచ్చారు. అనుభవమంటపం స్థాపించి అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించారు. వచన సాహిత్యంతో ప్రజలకు మార్గదర్శకత్వం చూపించారు. బసవేశ్వరులు కర్ణాటకలో బిజ్జల మహారాజు వద్ద ప్రధాన మంత్రిగా పనిచేసి, ప్రతిరోజు వేలాది జంగమూర్తులకు అన్నప్రసాదం అందించి తరువాత తాను భోజనం చేసే ఆచారాన్ని పాటించారు. బీదల సేవ, సమాన హక్కులు, ఆహారం-విద్య-వైద్యం ప్రతి మనిషికి హక్కులని అప్పటి నుంచే ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ సుదర్శన్, శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చక సిబ్బంది, సిద్దిపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి ఆశీర్వాదాలు అందించారు.






## బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం




మిరుదొడ్డి, ఏప్రిల్ 20, ( ప్రజా జ్యోతి ) : మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని పీఎంఎస్హెచ్ఆర్ఐ టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్/ఐసీ బాలుర పాఠశాలలో బాలల రక్షణ, సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం (ఢ్యు) ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైల్ ప్రొటెక్షన్ ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ మాట్లాడుతూ, విద్యార్థులకు బాలల హక్కులు, పోక్సో చట్టం, స్వీయ అవగాహన, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణపై వివరంగా అవగాహన కల్పించారు. 0 నుండి 18 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికల రక్షణ, సంరక్షణ కోసం చైల్ హెల్ప్లైన్ పనిచేస్తుందని తెలిపారు. పాఠశాల విడిచిన విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడం, బాలలపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టడం, బాల కార్మికత్వాన్ని నిర్మూలించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పిల్లలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే చైల్ హెల్ప్లైన్ నంబర్ 1098కు కాల్ చేయాలని సూచించారు. ఈ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## మద్దతు ధరలకే ధాన్యం విక్రయించాలి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 20 , (ప్రజాజ్యోతి):రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకే ధాన్యం విక్రయించాలని ఏపీఎం ధర్మసాగర్ తెలిపారు. మండల పరిధిలోని చింతమడక, సీతారాంపల్లి, మచాపూర్, పుల్లూరు గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఆయన వివిధ గ్రామాల సర్పంచులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని బాగా ఆరబెట్టి, తేమ శాతం తగ్గించిన తర్వాతే కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.దళారులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి, ప్రభుత్వ మద్దతు ధరల ప్రయోజనం పొందాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది, హమాలీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా

## కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన



మిరుదొడ్డి, ఏప్రిల్ 20, ( ప్రజా జ్యోతి ) : మిరుదొడ్డి మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యం కొనుగోలు జరగడం లేదని ఆరోపిస్తూ సోమవారం రైతులు రోడ్డుపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, పొద్దుతిరుగుడు, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వారాలు గడుస్తున్నప్పటికీ మార్కెట్కు తీసుకొచ్చిన పంటను కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిరుదొడ్డి మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు, మొక్కజొన్నలను వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

సిద్దిపేటఅర్బన్,ఏప్రిల్ 20(ప్రజాజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరకే అమ్ముకోవాలని సర్పంచులు తొడంగల వెంకటేష్, నాగుల స్రవంతి ప్రశాంత్ గౌడ్ ,అమ్ముల వెంకటయ్యలు అన్నారు.సోమవారం యాసంగి సీజన్ వడ్ల కొనుగోలు కేంద్రాలను సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల,ఎన్సాన్ పల్లి, తడకపల్లి గ్రామాలలో సర్పంచుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన సమయానికి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ,





ధాన్యాన్ని నిబంధనల కనుగుణంగా ఆరబెట్టుకొని తీసుకు రావాలని రైతులకు సూచించారు. మధ్యవర్తులను నమ్మి తక్కువ ధరకు వడ్లు ప్రవేట్ వ్యక్తులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పొన్నాల ఉప సర్పంచ్ సృజన సంపత్ యాదవ్, ఏఈఓ మీరా, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బాల్ రంగం ఎన్సాన్ పల్లి ఉప సర్పంచ్ సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్




దౌల్తాబాద్, ఏప్రిల్ 20: (ప్రజా జ్యోతి) గ్రామ ప్రజల సౌకర్యార్థం వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచులు ముచ్చమర్రి అనురాధ రమేష్ , పంజా స్వామి ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ముందు చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ




గ్రామ ప్రజలకు వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామపంచాయతీ ముందు చలివేంద్రాన్ని ప్రారంభించమన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో గ్రామ ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని తెలియజేశారు. అలాగే మండల పరిధిలోని గాజులపల్లి గ్రామపంచాయతీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ పంజా స్వామి.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆది బాలకృష్ణ , కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ జనగామ మల్లారెడ్డి ,వార్డు సభ్యులు తూర్పు శ్రీకాంత్, పాపగాని ప్రవీణ్ , కేంసారం నాగరాజు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, మరియు గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## రాయపోల్ గ్రామ మాజీ ఎంపీటీసీ దత్త రెడ్డి మృతి

### ఎంపీటీసీ గా గ్రామస్తులకు సేవలు

### 40 ఏళ్ల రాజకీయంలో ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో అందరికీ సుపరిచితం



దౌల్తాబాద్,ఎప్రిల్ 20 ( ప్రజా జ్యోతి) రాయపోల్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయ కులు.మాజీ ఎంపీటీసీ బాగన్నగారి దత్త రెడ్డి 80 సోమవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. అయన అప్పటి తెలుగుదేశం పా ర్టీలో క్రియాశీలకంగా పని చేశారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకా లు అందించి సేవలు అందించారు. గ్రామ ప్రథమ ఎంపీటీసీ గా బాగన్నగారి దత్త రెడ్డి తెలుగుదేశం పార్టీ నుంచి పోటి చేసి 1995 సంవత్సరంలో గెలుపొందారు. రాయపోల్ .తిమ్మక్కపల్లి ఎంపీటీసీగా గెలుపొందిన తర్వాత గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు.గ్రామంలోనే ఉంటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు నిస్వార్థంగా సేవలు అందించారు.అయన గత కొంత కాలంగా రాజకీయాలకు దూరంగా ఉన్నారు.గత 40 సంవత్సరాల నుంచి రాజకీయలో ఉండి ఉమ్మడి మండల మండల సీనియర్ నాయకునిగా గుర్తింపు ను తెచ్చుకున్నారు.అప్పటి దొమ్మట ఎమ్మెల్యే.మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి కి అత్యంత సన్నిహితుడిగా పేరు తెచ్చుకున్నారు.కాగా రాయపోల్ మాజీ ఎంపీటీసీ బాగన్నగారి దత్త రెడ్డి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.అయన మృతి పట్ల దౌల్తాబాద్. రాయపోల్ మండల చెందిన పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తంచేశారు.దత్త రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అంబులెన్స్‌లో సుఖ ప్రసవం



మిరుదొడ్డి, ఏప్రిల్ 20, ( ప్రజా జ్యోతి) : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి చెందిన గర్భిణీ శ్రీనిక కు రెండో కాన్పు నొప్పులు రావడంతో కుటుం బ సభ్యులు 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. వెంటనే మిరుదొడ్డి 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో తోర్నాల గ్రామ సమీపం లో నొప్పులు తీవ్రతరమయ్యాయి. ఈ క్రమంలో అంబులెన్స్లోనే 108 సిబ్బంది టెక్నీషియన్ రాజశేఖర్ సురక్షితంగా ప్రసవం నిర్వహించగా, శ్రీనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉండగా, అనంతరం వారిని సమీప ప్రభుత్వ మాతా–శిశు ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు 108 సిబ్బంది రాజశేఖర్, ఎల్లం కి కృతజ్ఞతలు తెలిపారు.